క్లుప్తంగా

ఉషా టోర్నీలో కాంస్య పతకాలు

ఖమ్మం స్పోర్ట్స్: జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు జరిగిన సీనియర్ ఫెడరేషన్ కప్ టోర్నీలో ఖమ్మంకు చెందిన అన్నాచెల్లెళ్లయిన క్రీడాకారులకు కాంస్య పతకాలు దక్కాయి. పురుషుల విభాగంలో పి.సత్యజిత్, మహిళల విభాగంలో పి.పవిత్రాచారి కాంస్య పతకాలు గెలుచుకున్నారు. వీరిని డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్ పి.పరిపూర్ణాచారి గురువారం అభినందించారు.

ఫ్యూచర్ టౌన్‌షిప్ వెంచర్ల బ్రోచర్లు ఆవిష్కరణ



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న చైర్మన్ రాంబాబు

ఖమ్మంమయూరిసెంటర్: శ్రీ జయవిలాసిని డెవలపర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఫ్యూచర్ టౌన్‌షిప్ పిండిప్రోలు వెంచర్ల బ్రోచర్‌ను గురువారం ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్, ఎండీ డాక్టర్ కుంచపు రాంబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సైదులు, జానిమియా, జహీర్, వెంకటేశ్వర్లు, బుర్రి కృష్ణ, కుంచపు విజయ, జ్యోతి, మేనేజర్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు చేరిన కేపీఎల్

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఖమ్మం ప్రీమియర్ లీగ్ (కేపీఎల్) టీ–20 క్రికెట్ పోటీలు ఫైనల్ దశకు చేరాయి. ఈ మేరకు గురువారం రాత్రి జరిగిన మొదటి సెమీస్‌లో బాలాజీ బ్లాస్టర్స్ – జేవీడీ చిటాస్ జట్లు తలపడగా బాలాజీ జట్టు విజయం సాధించి ఫైనల్స్‌కు చేరింది. కాగా, ఈ మ్యాచ్‌ను కేపీఎల్ అధ్యక్షుడు డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డితో పాటు ఓలేటి సాంబమూర్తి, ఎం.డీ.మతిన్, వెంకట్, నరేష్, శ్రీకాంత్, వత్సవాయి రవి పరిశీలించారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

ఖమ్మంరూరల్: మండలంలోని తల్లంపాడు ఉన్నత పాఠశాలలో గురువారం చేతన ఫౌండేషన్ ఆధ్వర్యాన పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైల్డ్ వెల్ఫేర్ పీడీ సాయిసంగీత మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వక్త రాధాకృష్ణ, ఎం.సురేష్, ఏలూరి శివ తదితరులు పాల్గొన్నారు.

ఎండ తీవ్రతతో అస్వస్థత

నేలకొండపల్లి: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ఎండ తీవ్రతతో అస్వస్థతకు గురయ్యాడు. నేలకొండపల్లికి చెందిన నాగేశ్వరరావు గురువారం మండలంలోని చెరువుమాధారం చెరువులో చేపల వేటకు వెళ్లాడు. అక్కడ చాలాసేపు ఎండలో ఉండడంతో అస్వస్థతకు గురై స్పృహ తప్పగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మోతాదుకు మించి మాత్రలు మింగి ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మండలంలోని మంగ్రాజుపల్లికి చెందిన నాగలక్ష్మి గురువారం ఇంట్లోని మాత్రలు ఎక్కువ మోతాదులో మింగింది. అస్వస్థతకు గురైన ఆమెను కాసేపయ్యాక గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. అయితే, ఆమె ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

ఇరువర్గాల వివాదంపై కేసు నమోదు

రఘునాథపాలెం: రఘునాథపాలెంలో ఇరువర్గాల నడుమ జరిగిన వివాదానికి సంబంధించి పరస్పరం చేసిన ఫిర్యాదులతో గురువారం కేసులు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరి తెలిపారు. మండలంలో మట్టి దందాపై మందా బుచ్చిబాబు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా చలపాటి హరిబాబు, చలపాటి శంకర్ గురువారం ఉదయం ఆయన ఇంటికి వెళ్లి దూషించి చంపుతామని బెదిరించారు. దీంతో బుచ్చిబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, మట్టి వ్యాపారంపై బుచ్చిబాబు తప్పుడు ప్రచారం చేస్తుండడంతో అడిగేందుకు వెళ్లిన తమపై దాడి చేయగా తనకు గాయాలయ్యాయని హరినాథ్‌బాబు చేసిన ఫిర్యాదుతో ఇంకో కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

గ్రామదీపిక ఇంటికి తాళం..

కామేపల్లి: కామేపల్లి గ్రామానికి చెందిన గ్రామదీపిక శీలపాక ఇందిర ఇంటికి సిరి గ్రూప్ డ్వాక్రా సభ్యులు గురువారం తాళం వేశారు. తమ గ్రూప్ సభ్యులకు సంబంధించిన రూ.4 లక్షలు వినియోగించుకున్నందున గ్రూప్ సభ్యులు గ్రామదీపికను నిలదీసి గల నెల 16న ఆమె ఇంటి ముందు ఆందోళన చేశారు. దీంతో అదే నెల 29న ఇస్తానని గ్రామదీపిక గడువు లోపు ఇవ్వకపోవడంతో గురువారం ఆమెను ఇంట్లో ఉంచి తలుపులకు తాళం వేశారు. దీంతో గ్రామ పెద్దలు జోక్యం చేసుకుని మార్చి 15న చెల్లిస్తుందని తెలపడంతో గ్రూప్ సభ్యులు ఆందోళన విరమించారు.

బాధ్యతలు భారమైనా..

కార్యదర్శుల సమన్వయంతో ప్రత్యేకాధికారుల పాలన

- అదనపు బాధ్యలతో గ్రామాల్లో ముందుకు సాగని పనులు
- నేటికీ చెక్ పవర్‌పై స్పష్టత రాని వైనం
- ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరేనా?



నేలకొండపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

సర్పంచ్‌ల పదవీ కాలం ఫిబ్రవరి 1వ తేదీన ముగియడంతో ప్రభుత్వం గెజిటెడ్ స్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించి పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో పాలన సాగిస్తున్నారు. ప్రత్యేకాధికారులుగా ఉన్న ఎంపీడీఓ, తహసీల్దార్‌లను లోక్‌సభ ఎన్నికల నేపథ్యాన పని ఒత్తిడితో.. గ్రామీణ ప్రాంతాల్లో పాలనపై ప్రభావం పడుతుంది.

నేలకొండపల్లి: పాలేరు నియోజకవర్గంలో నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలంలోని 114 గ్రామపంచాయతీలలో ఎంపీడీఓ, తహసీల్దార్, మండల పంచాయతీ అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించారు. ఒక్కో అధికారికి ఐదు లేదా ఆరు పంచాయతీల చొప్పున బాధ్యతలు అప్పగించగా.. వారు తమ సొంత శాఖతో పాటు తమకు కేటాయించిన పంచాయతీల బాధ్యతలను పంచాయతీ కార్యదర్శులతో కలిసి నిర్వర్తిస్తున్నారు. ఒక పక్క సొంత శాఖ పనులతో పాటు ఎన్నికల విధులు, మరో పక్క పంచాయతీల సమస్యలపై దృష్టి సారించాల్సి రావడంతో ఏ పనులు సరిగ్గా ముందుకు సాగడం లేదు. దీంతో ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అదనపు భారం..

సర్పంచ్‌లకు ఉండే బాధ్యతలను ప్రత్యేకాధికారులకు అప్పగించడంతో అటు సొంత శాఖ పనులు చేయలేక, ఇటు పంచాయతీ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ, ఎంపీఓలు కలిసి ప్రతీ పంచాయతీలో 15 రోజులకోసారి గ్రామసభలు నిర్వహించాలి. పల్లెల అభివృద్ధికి కృషి చేయాల్సి ఉంటుంది. పారిశుద్ధ్యం, నీటి సరఫరా, ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలి. చాలా చోట్ల పంచాయతీ కార్యదర్శులు మధ్యాహ్నం నుంచి అందుబాటులో ఉండడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇదేంటని ప్రశ్నిస్తే మండల కార్యాలయాలలో సమావేశాలు ఉన్నాయంటూ సమాధానం దాటవేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.



సమావేశంలో సూచనలు చేస్తున్న ఎంపీడీఓ యర్రయ్య (ఫైల్)

చెక్ పవర్‌పై స్పష్టత కరువు..

పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేకాధికారికి జాయింట్ చెక్ పవర్ రాకపోవడంతో పారిశుద్ధ్యం తదితర నిర్వహణ ఖర్చులకు ఇబ్బంది పడాల్సి వస్తుంది. చెక్ పవర్‌ను ఇప్పటికే ఇవ్వాల్సి ఉండగా.. జాప్యం చేస్తున్నారు. బ్యాంక్, ట్రెజరీ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. జాయింట్ చెక్ పవర్ సవ్యంగా జరిగే అవకాశం ఉంటున్నందున ఆ దిశగా యంత్రాంగం చర్యలు తీసుకోవాలి.

ఇబ్బంది లేకుండా చూడాలి..



ప్రత్యేకాధికారుల పాలనలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి. కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు సమన్వయం చేసుకుంటూ ప్రజల సమస్యలను పరిష్కరించాలి. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీటి, పారిశుద్ధ్యం సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలి. అవసరమైతే అధికారులు గ్రామపెద్దల సహకారం తీసుకోవాల్సి ఉంది.

– మేకల వెంకటేశ్వర్లు, మాజీ రైతు సమన్వ సమితి కన్వీనర్, కోనాయిగూడెం

బాధ్యతలు తగ్గించాలి..



అధికారులకు అదనపు బాధ్యతలతో సతమతమవుతున్నారు. వారి బాధలు కూడా అర్థం చేసుకోవాలి. ఓ పక్క ఎన్నికలు, మరో పక్క సొంత శాఖల బాధ్యతలు, తిరిగి ఐదారు పంచాయతీల పాలన చేయడంతో ఏ శాఖకు న్యాయం చేయలేకపోతున్నారు. కనీసం పంచాయతీల సంఖ్యను కుదిస్తే బాగుంటుంది.

– రావెళ్ల కృష్ణారావు, సొసైటీ మాజీ డైరెక్టర్, మోటాపురం

అందరికీ న్యాయం చేస్తాం..



ప్రత్యేకాధికారుల పాలనలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగనీయం. ప్రజలకు సేవ చేసేందుకు ప్రభుత్వం ఎన్ని బాధ్యతలు అప్పగించినా.. పూర్తిస్థాయిలో బాధ్యతగా నిర్వహించి న్యాయం చేస్తాం. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం వంటి సమస్యలపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండేలా కార్యదర్శులు, ప్రత్యేకాధికారులకు సూచనలు, సలహాలు అందిస్తున్నాం.

– ఎం.యర్రయ్య, ఎంపీడీఓ, నేలకొండపల్లి

ఘనంగా అమ్మవార్ల మినీ జాతర



అమ్మవార్లకు పూజలు చేస్తున్న భక్తులు

కామేపల్లి: పండితాపురం గ్రామంలో వేంచేసిన సమ్మక్క–సారలమ్మ మినీ జాతరను భక్తిశ్రద్ధలతో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకొని మేళతాళాలు, శివశక్తుల నృత్యాలు ఆట పాటలతో సందడిగా అమ్మవారి గద్దెల వద్దకు చేరుకొని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోయినపల్లి శ్రీను స్వామి ఆధ్వర్యాన అమ్మవారికి నిలువెత్తు బంగారం(బెల్లం) సమర్పించి, ఒడి బియ్యం పోసి పూజలు నిర్వహించారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబయాదవ్, చిలుకల వెంకటనర్సయ్య, దొడ్డ శ్రీనివాస్, ధనూరి బాలరాజు, బానోత్ నరసింహానాయక్, మల్లెంపాటి రామారావు, నల్లమోతు లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

'దివ్య ఖురాన్' మార్గదర్శకం

ఖమ్మం మామిళ్లగూడెం: దివ్య ఖురాన్ మానవాళి అంతటికీ మార్గదర్శకమని జమాతె ఇస్లామీ హింద్ జాతీయ కార్యవర్గ సభ్యురాలు నాసిరా ఖానమ్ సాహెబా అన్నారు. గురువారం రాబోయే రంజాన్‌ను పురస్కరించుకొని ఖమ్మం ఉర్దూఘర్ షాదీఖానాలో జిల్లా మహిళా అధ్యక్షురాలు అస్మా అన్జుమ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రంజాన్ మాసంలో ప్రతీ వ్యక్తి భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు ఉండాలన్నారు. అనంతరం హైదరాబాద్ సభ్యురాలు అర్జుమన్ద్ రిజ్వి సాహెబా మాట్లాడగా.. అన్జుమ్, హుస్సైన్‌బీ, ఖాసిమా షాహిన్, సైదాబాను, గౌసియా, విఖార్, సీమ, అతహార్, సుల్తానా, అఫ్‌రోజ్, నస్రీన్, తదితరులు పాల్గొన్నారు.

మొదటి ప్రయత్నంలోనే..



కన్నమాల భరణి

కామేపల్లి: తెలంగాణ సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీకి నిర్వహించిన రాత పరీక్ష ఫలితాలు గురువారం విడుదల కాగా కామేపల్లివాసి ఎంపికైంది. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గ్రామానికి చెందిన కన్నమాల శ్రీనివాసరావు కూతురు భరణి తన మొదటి ప్రయత్నంలోనే జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించింది. అదే విధంగా జోగ్గూడెం గ్రామానికి చెందిన హట్కర్ చిట్టిబాబు గురుకుల డిగ్రీ లెక్చరర్‌గా ఎంపికయ్యాడు.

అక్రమ కేసులను ఎత్తివేయాలి

రఘునాథపాలెం: గత ప్రభుత్వ హయాంలో మండల పరిధిలోని గృహలక్ష్మి పథకం లబ్ధిదారులు ఎంపికలో జరిగిన అవకతవకలపై అఖిలపక్షం ఆధ్వర్యాన జరిగిన ఆందోళనలో పలువురిపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని సీపీఎం రఘునాథపాలెం మండల కార్యదర్శి ఎస్.నవీన్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తక్షణమే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ తీసుకొని కేసులను ఎత్తివేయాలని కోరారు.

తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు

కామేపల్లి: పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజనీరింగ్ ఇంట్రా డి.పుష్పలత అన్నారు. గురువారం కామేపల్లి హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు తాగునీటి సౌకర్యాలను పరిశీలించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. గ్రామాల్లో వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని, ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈ నవీన్‌కుమార్, ఏఈ సతీశ్, కార్యదర్శి పెండ్ర అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆస్పత్రి వద్ద అన్నదానం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని ప్రభుత్వాస్పత్రి వద్ద గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. మమత మెడికల్ కళాశాలకు చెందిన డీటీపీ ఆపరేటర్ రామకృష్ణ తన జన్మదినం సందర్భంగా రూ.4 వేలు విరాళంగా అందించారన్నారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు పన్నీరు జగన్మోహన్‌రెడ్డి, యోగానందరెడ్డి, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీరువా వితరణ



బీరువా అందజేస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: అవామె హింద్ వెల్ఫేర్ అండ్ ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన నిరుపేద యువతి వివాహానికి గురువారం బీరువా వితరణ చేశారు. ఖమ్మం పార్సిబందర్‌కు చెందిన నిరుపేద యువతి వివాహానికి ఆమె బంధువులు సహకరించాలని ఫౌండేషన్ చైర్మన్ హఫీజ్ జవ్వాద్ అహ్మద్‌కు విజ్ఞప్తి చేయగా.. ఆయన ఈ వితరణ చేశారు. తమ ఫౌండేషన్ రంజాన్ మాసంలోనే కాకుండా ఇతర సమయాల్లోనూ ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని చైర్మన్ తెలిపారు.

పోలియో చుక్కలు వేయించాలి

కామేపల్లి: పుట్టిన నాటి నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని ఎంపీడీఓ రవీందర్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మార్చి 5న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంపై మండల టాస్క్‌ఫోర్స్ సభ్యులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఐదేళ్ల లోపు 2,832 మంది చిన్నారులను గుర్తించామన్నారు. తహసీల్దార్ సుధాకర్, పీహెచ్‌సీ వైద్యాధికారి చందన, శిరీష, ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఏఈ శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల నివాళి

కామేపల్లి: తాళ్లగూడెం గ్రామానికి చెందిన సీపీఐ సభ్యురాలు పుచ్చకాయల నవ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా గురువారం దిశదినకర్మ సందర్భంగా ఆమె చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌తో పాటు తోట రామాంజనేయులు, పుచ్చకాయల వెంకటేశ్వర్లు, కృష్ణయాదవ్, వెంకటకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కరుణామయుడి జీవితం ఆదర్శం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మత గురువులు, పక్కన ఫాదర్లు

ఖమ్మంరూరల్: కరునామయుడి జీవితం లోకానికి ఆదర్శమని దైవ సందేశకుడు, ఆధ్యాత్మిక గురువు పసుపులేటి యుగల్‌కుమార్ అన్నారు. నాయుడుపేటలోని కరుణగిరి చర్చిలో రెండో రోజు గురువారం నిర్వహించిన పుణ్యక్షేత్ర మహోత్సవాల్లో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉపవాస దీక్ష చేపట్టిన విశ్వాసులు ఈ మహోత్సవాల్లో పాల్గొని భాగ్యవంతులు కావాలన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కరుణగిరి డైరెక్టర్ మాథ్యూవరప్రసాద్‌రాజు, రెవరెండ్ ఫాదర్ తుడుం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన వర్కర్ల నిరసన



నిరసన తెలుపుతున్న ఏజెన్సీ నిర్వాహకులు

నేలకొండపల్లి: నేలకొండపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన వర్కర్లు గత ఆరు నెలలుగా బిల్లులు రాకపోవడం, వేతనాలు చెల్లించకపోవడంతో గురువారం పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ.. ప్రభుత్వం కోడిగుడ్డుకు రూ.5 చెల్లిస్తుండగా.. తాము రూ.7 చెల్లించి విద్యార్థులకు వడ్డిస్తున్నామన్నారు. గ్యాస్ కూడా సరఫరా చేయడం లేదని మండిపడ్డారు. బిల్లులు వెంటనే చెల్లించకపోతే శుక్రవారం నుంచి తాము విద్యార్థులకు మధ్యాహ్న భోజనాలు చేసేది లేదని హెచ్చరించారు. ఇకనైనా పెండింగ్ బిల్లులు, వేతనాలు, గ్యాస్ అందించాలని కోరారు. ఈమేరకు స్థానిక హెచ్ఎంకు నిర్వాహకులు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ నిర్వాహకులు పూజల అనుసూయ, పి.నాగమణి, కె.మల్లమ్మ, బి.మల్లమ్మ, పి.విజయ తదితరులు పాల్గొన్నారు.

పాత కమిటీని రద్దు చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం పాత కమిటీని రద్దు చేసి నూతనంగా ఎన్నికలు నిర్వహించాలని ఆ సంఘం జిల్లా ఇన్‌చార్జ్ అధ్యక్షుడు బోయినపల్లి రామారావుగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత అధ్యక్షుడు తన ఉద్యోగ బాధ్యతల నుంచి సస్పెండ్ అయినా సంఘ సభ్యులకు తెలియకుండా అధ్యక్షుడిగా కొనసాగారన్నారు. అధ్యక్షుడిని తొలగించాలని తీర్మానాలు చేసి రాష్ట్ర కమిటీకి పంపినట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకుడు వీ.జీ.కే.మూర్తి, గౌరవ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు గడ్డం రాములు, ప్రధాన కార్యదర్శి దాసరి వేణుగోపాల్, కోశాధికారి ప్రసాద్, నగర అధ్యక్షుడు గంగన్న పాల్గొన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ

ఖమ్మంసహకారనగర్: టీఎస్టీఓ యూనియన్ ఆధ్వర్యాన రూపొందించిన విద్యాశాఖ ఫోరమ్ క్యాలెండర్లను జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మతో కలిసి టీఎన్జీఓ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్.అఫ్జల్ హసన్, ఆర్.వీ.ఎస్.సాగర్ ఆవిష్కరించారు. గురువారం ఐడీఓసీలోని విద్యాశాఖ ఫోరమ్ అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ యూసఫ్, నగేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నందగిరి శ్రీను, రాష్ట్ర కార్యదర్శి జీ.వీ.ఎస్. ప్రసాద్‌ల ఆధ్వర్యాన క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు చుంచు వీరనారాయణ, మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు శాబాసు జ్యోతి, వైరా యూనిట్ అధ్యక్షురాలు స్వప్న, ఆస్పత్రి ఫోరమ్ కార్యదర్శి హబీబ్, టీఎన్జీఓ జిల్లా, ఐడీఓసీ బాధ్యులు వై.శ్రీనివాసరావు, సైదులు దేవేందర్, కార్యాలయం సూపరింటెండెంట్ చావా శ్రీనివాస్రావు, ధన, జి.స్వర్ణలత, శశికుమారి, శ్రీదేవి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనం నడిపితే చర్యలు

ఖమ్మంక్రైం: మైనర్లు వాహనాలు నడపకుండా అరికట్టేందుకు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నట్లు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు పెరగడానికి మద్యం తాగి వాహనాలు నడపడమే కాక మైనర్లు డ్రైవింగ్ చేయడం కారణాలుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు ఇటీవల చేపట్టిన తనిఖీల్లో 59 మంది మైనర్లు పట్టుబడగా, వాహనాలకు సీజ్ చేసి తల్లిదండ్రుల సమక్షాన కౌన్సెలింగ్ ఇచ్చామని తెలిపారు. మరోసారి వీరు పట్టుబడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక గురువారం చేపట్టిన తనిఖీల్లో నంబర్ ప్లేట్ లేని 54 వాహనాలను సీజ్ చేశామని ఏసీపీ చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ మోహన్‌రావు, ఎస్ఐ రవి, ఆర్ఎస్ఐ సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి మెగా డీఎస్సీ..

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలను బలోపేతం చేసేందుకు మెగా డీఎస్సీని ప్రకటించటం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు తెలిపారు. గురువారం సంఘం కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులకు స్వీట్లు తినిపించి సంబురాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.యాదగిరి, మన్సూర్, నాయకులు కరీముల్లా, సుధాకర్, సత్యనారాయణ, రవి, రాజు, వై.నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాయల నాగేశ్వరరావు, నగర అధ్యక్షులు మహ్మద్ జావీద్‌లు పాల్గొన్నారు.

పార్ట్ టైం స్వీపర్లను ఆదుకోవాలి

కూసుమంచి: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పార్ట్ టైం స్వీపర్లుగా పనిచేసిన వారిని గత ప్రభుత్వం తొలగించిందని, తమను తిరిగి విధుల్లో తీసుకోవాలని పలువురు స్వీపర్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం తమతో వెట్టి చాకిరీ చేయించుకుని అర్ధాంతరంగా తొలగించిందని, దీంతో తాము వీధినపడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. తమను విధుల్లోకి తీసుకొని ఆదుకోవాలని బాధితులు కోరారు.

రైతులకు శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలి

కూసుమంచి: రైతు వేదికల్లో ప్రతీ మంగళ, శుక్రవారాల్లో రైతులకు ఏఈఓలు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని కూసుమంచి ఏడీఏ విజయచంద్ర సూచించారు. గురువారం కూసుమంచిలోని రైతు వేదికలో నిర్వహించిన ఏఈఓల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎం కిసాన్ పథకం పొందేందుకు ఈకేవైసీ, ఎన్‌పీసీఐ పెండింగ్ ఉన్న రైతులను గుర్తించడంతో పాటు ఇంకా ఏమైనా పంటన నమోదు పెండింగ్‌లో ఉంటే వెంటనే పూర్తిచేయాలని సూచించారు. కూసుమంచిలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ యూనిట్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు ఏడీఏ వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ వాణి పాల్గొన్నారు.

అన్నదమ్ముల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న అన్నదమ్ములు

కూసుమంచి: పూర్వ విద్యార్థుల సమ్మేళనం లాగా ఓ సామాజిక వర్గానికి చెందిన వారు తమ అన్నదమ్ములతో ఆత్మీయ సమ్మేళనాన్ని గురువారం కూసుమంచిలో నిర్వహించారు. గౌడ సామాజికి వర్గానికి చెందిన వారు నిర్వహించిన ఈ సమ్మేళనంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారి అన్నదమ్ములు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆటపాటలతో సందడిగా గడిపారు. తమలోని సోదర భావం మరింత పెంపొందించేందుకే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తాం..

ఖమ్మంఅర్బన్: నగరంలోని 5వ డివిజన్ బాలాజీనగర్‌లో గల శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవాలయ నూతన ఆలయ కమిటీ స్వామివారి సన్నిధిలో భక్త బృందం సమక్షంలో గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. దేవాలయ అభివృద్ధి, భక్తుల కోరిన విధంగా స్వామివారి సేవా కార్యక్రమాలను నూతన కమిటీ కొనసాగిస్తున్నందన్నారు. ఈమేరకు కమిటీ అధ్యక్షుడిగా ఎల్లంపల్లి హనుమంతరావు, ఉపాధ్యక్షులుగా కోయ శ్రీనివాసరావు, బొందిలి నాగేంద్రసింగ్, ప్రధాన కార్యదర్శిగా కోలేటి రాధాకృష్ణ, కోశాధికారిగా గద్దె వెంకటేశ్వర్లు, ఇతర కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయగా.. పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి సుబ్బారావు, కటకం చిన్న హనుమంతరావు, తమ్మినేని వెంకటేశ్వరరావు, నామ లక్ష్మయ్య, పల్లిబోయిన చంద్రయ్య, ఖాదర్‌బాబు, తమ్మినేని పాపారావు, ప్రమోద్‌కుమార్, సుహాసని, లింగాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'మాస్‌లైన్' మహాసభలు జయప్రదం చేయండి

ఖమ్మంమయూరిసెంటర్/తిరుమలాయపాలెం: మూడు విప్లవ పార్టీలు ఐక్యం కానుండగా, ఖమ్మంలో ఈనెల 3 నుంచి జరిగే మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల అశోక్, ఆ పార్టీ జిల్లా నాయకుడు కమ్మకోమటి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం ఖమ్మంలో నిర్వహించిన ద్విచక్ర వాహన ర్యాలీని ప్రారంభించిన సందర్భంగా అశోక్, తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో నాగేశ్వరరావు మాట్లాడారు. కార్మిక విప్లవ పార్టీల ఐక్యత చారిత్రక అవసరమని తెలిపారు. ప్రజాపంథా నాయకులు ఝాన్సీ, కొల్లేటి నాగేశ్వరరావు, కె.శ్రీను, శోభ, ఆజాద్, వెంకటేష్, కంకణాల శ్రీను, సురేష్, చందు, తిమ్మిడి హన్మంతరావు, సోమనపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అరుదైన రోజు..

ఫిబ్రవరి 29 అరుదైన రోజు. ఎందుకంటే ప్రతీ నాలుగేళ్లకు ఒకసారి వస్తుంది కాబట్టి ఈ రోజున పుట్టడం, పెళ్లి చేసుకోవడం ఒక స్పెషల్ అనే చెప్పాలి. ఈ నేపథ్యాన గురువారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఇద్దరు తల్లులు తమ బిడ్డలకు జన్మనిచ్చారు. ఖమ్మంరూరల్ మండలం మద్దివారిగూడెంకు చెందిన ఉమ,బోనకల్ మండలం రావినూతలకు చెందిన స్నేహలత బిడ్డలకు జన్మనిచ్చారు.ప్రతీ నాలుగేళ్లకు తమ బిడ్డల పుట్టిన రోజు జరుపుకోవడం ఆనందంగా జరుపుతామని తెలిపారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్



పుట్టిన బిడ్డతో మద్దివారిగూడెంకు చెందిన ఉమ



రావినూతలకు చెందిన స్నేహలత